858

# గులాబీ ముల్లు

దీని మెళ్ళో పుస్తెవడు ముడేస్తాడు? అద్దాల అలమర్లో వేలాడేసిన ఈ డోరియాల చీర ఎవత్తె కట్టుకుంటుంది? మెట్లమీది మూడుచక్రాల సైకిలు ఎవరిపిల్లాడు తొక్కుతాడు! షాపులోని డన్ లప్ పరుపుమీద ఎవరుపడి దొర్లుతారు? ఈ ట్రాన్సిస్టర్ ఏసిస్టర్ చేతుల్ని అలంకరిస్తుంది? ఆ కొత్తగాకట్టిన రంగులమేడలోకి ఎవరొచ్చి దిగుతారు? ఈ ప్లేట్లో ఇడ్లీ ఎవరినోట్లోకి వెళ్తుంది? కాంపౌండ్ దగ్గర లాంతరు స్తంభం దిగువను

చెత్తకుండీ పక్క తట్టవోర్లించుకు కూర్చుని ఏడుస్తున్న ముసలిదాని కన్నీరెవరు వచ్చి చేత్తో తుడుస్తారు? సందులో పరిగెట్టి ఆడుకుంటున్న బుజ్జి కుక్కపిల్లకు పాలెవరు పోస్తారు? రోడ్డుమీద లారీ నిండుగా మేటు వేసి కట్టి తీసుకుపోతున్నారు గడ్డి. ఇంతగడ్డి మనుష్యుల్లో ఎవరు తింటారు చెప్మా? ఇలా ఆలోచిస్తూ పిచ్చి పిచ్చి ప్రశ్నలు వేసుకుంటూ పూచిక పుల్లతో పళ్ళు కుట్టుకుంటూ కూర్చున్న నాకు మావారొచ్చి ఓ సంతోష వార్త చెప్పారు. ప్రమోషను. ఇంక్రిమెంటు. లాటరీలో ప్రయిజు అలాటి దేమీకాదు. అవన్నీ ఆనందం కలిగించవు. పక్కవీధిలో కొత్తగాదిగిన సూపరెంటు గారింట్లో రాత్రి దొంగలు పడ్డారు నీకు తెలీసా అని ఉత్సాహంగా అడిగారు. పడితే దొంగలు పక్కవాళ్ళ వాటాలోనే పడాలి. మనింట్లో పడకుండా వాళ్ళింట్లో ఎందుకు పడ్డారని అనలేదు. "అయ్యో మనకు తెలీదే" అన్నాను. ఎవరింట్లోనైనా దొంగలు పడితే ఎందుకో గొప్ప సంతోషంగా వుంటుంది. "ఏంవుందో ఏంపోయిందో పాపం" అని పైకనేశా. శుద్ధ కుశాలమయి వుంటుంది.

నగలన్నీధరించి పట్టుచీర కట్టుగుని చక్కగా ముస్తాబయి వెళ్ళి పలకరించి రాబుద్ధయింది. దొంగలు పడ్డ ఆర్నెల్లకువెళ్తే ఏం బావుంటుందని. వెంటనే పరామర్శించివస్తే. పుణ్యమూ పురుషార్ధమూనని బయల్దేరా. జూనియర్ని పిలిచివస్తావా అని కళ్ళెగరేశా. జూనియరంటే మా ఇంటివాళ్ళఅమ్మాయి. తిండి తినడం. మంచంవిరిగేలా నిద్రపోడం. సినిమా పాటల పుస్తకాలు ప్రోగుచేయడం. అడ్డమైన పుస్తకాలూ చదవడం. అడ్డంగా బలిసిపోడం కార్యక్రమంగా పెట్టుకుందా అమ్మాయి. ఏ పరీక్షకైనా యిట్టేకట్టేసివచ్చి నిద్రపోతుంది. ప్రతిపరీక్ష యిట్టే ఫేలవుతుంది. గుండెలమీద కుంపటిలా కూర్చోడంమినహా ఆ అమ్మాయికి. వేరే పనేలేదు. ఇలాటి ప్రోగ్రాములకోసం కళ్ళింతచేసుకొనిచూస్తూ.

వుటుంది. మావారు ఆ పిల్లను నాకు జూనియర్ అని వట్టినే అన్లేదు. దెబ్బలాట లేవేనా వస్తే ఘుంయ్‌మని లేస్తుంది. నాలిక మహాచురుకు చాపమీద కూర్చున్నపుడు చేతులకు పనిచెప్పక పోవడమెందుకని ఈనెలు తీస్తూ వుంటుంది. తాటాకు విసనకర్రలు చింపి ప్రోగులు పెడుతుంది. నీళ్ళగ్లాసులో వ్రేళ్ళుముంచి భూమిమీద గ్రాయింగులు వేస్తుంది. కారప్పూస కరకరమని నమిలేస్తుంది. వేడివేడికాఫీ గటగట త్రాగేసి. చేరెడు వక్కపొడి కొంగున మూటగట్టి తెచ్చుకున్నది నోట్లోపోసుగుని ఆకుల్ని (తమలపాకులే మరేమీకాదు) మేకలా నమిలేసి "పిన్నిగారూ నా నోరు ఎలాపండిందో' అని నాలికచాపి మూతి వంకర్లుతిప్పి చూపిస్తుంది, శకుంతల జూనియర్ కావడానికి ఇవేమీ కారణాలుకావు. మా ఇంట్లోంచి పట్టిగెళ్ళిన పుస్తకాలన్నీ చదివి అవన్నీ మార్చేసి మంచంమీదకూర్చొని పరపరా నవల రాసేస్తూ వుంటుంది. "వన్ సైడు పేపరుందా" అని అడుగుతుంది శకుంతల. వన్ సైడు కాగితాలన్నీ ఆ అమ్మాయికిస్తూవుంటే అవన్నీ నవలవ్రాసి తిరిగి పట్టుకొచ్చి నాకు చదివి వినిపిస్తూ వుంటుంది.

పోస్టుమన్ రోజుకు అరడజను కవర్లకు తక్కువ లేకుండా పట్టుకొచ్చి శకుంతలకు ఇస్తూ వుంటాడు. లలితాసహస్ర నామాల్లా ఎన్ని మారు పేర్లు పెట్టుకున్నా అన్నీ ఆదేవికేవచ్చి చేరుతుంటాయి. ఈ సిరా కాగితాలు పోస్టేజీకయే ఖర్చులు ఆపు చేద్దామనే వుద్దేశంతో వాళ్ళ నాన్నగారు ఏవో పెళ్ళి సంబంధాలు చూసినా వాళ్ళందరికి ఏవో వంకలు పెట్టి పంపింది జూనియర్. శేఖర్. కుమార్. రాజగోపాల్, జగదీశ్. బిరేంద్ర, అజయబాబు. యిలాటి సుమాకుమారమైన పేర్లు. కాకుండా సుబ్బారావు, సూర్నారాయణ. సీతారామయ్య. వెంకటరత్నం. రఘురామయ్య. సత్యం లాంటిపేర్లు కలవారినందర్నీ తిరగ కొట్టింది. కనీసం ప్రకాష్,

ప్రసాద్, భాస్కర్ వినోద్‌లాంటి పేర్లైనా ఫరవాలేదంది. ఆరుకార్లు ఏడు రొట్టిపెట్టెలు మూడునాలుగు ఏనుగులు, తోటలో పెద్దబంగాళా. ఆయాలు నవుకర్లూ అంతా వుండాలంది. అంచేత జూనియర్‌కి నవలల్లో కథానాయకుడిచేత అన్ని సరదాలు అప్పట్లు ముచ్చట్లు వ్రాసి తీర్చుకోవడానికి వీలయింది. కాని జీవితంలో మగాడన్న వాడు సుకుమారుడు సుందరుడు సుశరీరుడు శకుంతలకు సేవలు చేయడానికి ఆ రాయలకు రాతగ్గవాడు దర్జీ తెలుగు దేశంలో పుట్టలేదు. అంచేత నిర్గంధ కుసుమంలా వేస్టు లాండ్‌లాటి ఈ ఆంధ్ర ప్రదేశంలో శకుంతల జూనియర్‌గా వుండిపోక తప్పలేదు. ఇలా పెళ్ళీ ఉద్యోగం ఓ వ్యాపకం అంటూ లేకుండావున్న ఆడపిల్లలు నవలల్రాస్తారంటే తప్పా? నవలలాగ్రీయక మరేంచేస్తారు? సిరా కాగితపు పరిశ్రమ, ఇంకులు, ప్రింటింగు పరిశ్రమ యిన్నోటిని పోషిస్తున్నారుకారా. తెలుగు దేశంలో పరిశ్రమలు లేవని మీరేఘోషిస్తూంటారు. మళ్ళీ యిలా అన్ని పరిశ్రమలనూ చేయూతనిస్తూన్న మా శకుంతల లాంటి జూనియర్లను ఆడిపోసుకుంటారు; అంచేత జూనియర్ క్రొత్త నవలకు ఏవైనా పాత్రలుకాని ప్లాటుకాని వాక్కుపోతుందా అని నాలో కూడా సూపరెంటు గారింటికి వస్తానంది.

మేం ముస్తాబయి నెమ్మదిగా తడుకుతూ తాయతూ వాళ్ళింటి కెళ్ళేసరికి పెద్ద అల్సేషియన్ కుక్క అరుచుకుంటూ మీద కొచ్చింది. మామధ్యన టకటాలగేటువుందిలెండి. ఆ కుక్క తాలూకు బంధువెవరో వచ్చి గొలుసుల్ని పట్టిలాగి గుంజకు కట్టేసి మమ్మల్ని లోనికి ఆహ్వానించాడు.

ఆయన సూపరెంటుగారికి బాసమరిదో తమ్ముడో అయివుండాలి. లావు మొహం-నల్ల కళ్ళజోడు. మూతి దాకలా పెట్టి నవ్వాడు. బనీసు పైజమా వేసుకున్నాడు. దొంగలతో పోరాడి దెబ్బలు తిన్న

లక్షణాలు నాకెక్కడా అవుపడలేదు. కుక్క కట్టిన గుంజను లాగుతున్నది. తోడేలులా వుంది. నాలిక బైట పెట్టి వాగురుస్తున్నది. డొక్కలు ఎగసెగసి పడుతున్నాయి. బాగా మెక్కి వుంటుంది. ఆ పందిరిమీద బోగన్‌విల్లా అల్లుకుపోయింది. మా జూనియర్ వ్రాసే నవలల్లో ప్లాటుల్లా.

పూవుల్తో నిండిపోయిన ఆ పందిరి వూగుతోంది. ఆ పెద్ద మనిషి మొహంమీద వెలిగించిన చిరునవ్వు మాయనివ్వకుండా మమ్మల్ని దర్జీ ముందు తీగల జాఫరీలో పేము కుర్చీలో కూర్చో పెట్టి "రచయిత్రి వస్తారు కూర్చోండి" అని వినయంగా చెప్పి లోపలి కెళ్ళిపోయాడు. లోపల నుంచి మళ్ళీ ఆయనే షర్బత్తులు నింపిన రెండు గ్లాసుల్ని ట్రేలో పెట్టి తెచ్చి మా ముందు వుంచి "పుచ్చుగోండి" అని మర్యాదగా అనేసి ఓ బొమ్మల పుస్తకం ఓ ఆల్బం మా ముందు పెట్టి రేడియో సన్నగా ట్యూన్ చేసి ఫాన్ వేసి వెళ్ళిపోయాడు. దొంగల్ని కూడా యింత మర్యాద చేసే లాగున్నాడే యీయనెవరో అనుకుంటూ ముసి ముసి నవ్వులు నవ్వుకున్నాం.

అప్పుడొహ కెంపురంగు పట్టుచీరమీద నీలం పసుపు ఆకుపచ్చ రంగు పువ్వులు అద్దినచీర కట్టుగున్న ఎలుగు బంటి వచ్చి గ్లాడ్ టు మీట్ యూ అంది. బాబ్డ్ హెయిర్ సింహం జూలులా ఎగుర్తోంది. నల్లటి రవిక మెళ్ళో నీలం పూసలదండ మొహం అంతా కోటా కొట్టేసింది. సెంట్లు లవండర్లు మేకప్ సువాసనలు వరండా అంతానిండి మమ్మల్ని వుక్కిరి బిక్కిరి చేసేశాయి. ఇద్దరం నిలబడి నమస్కారంచేశాం. మమల్ని కూర్చోమని తను పెద్ద కుర్చీలాక్కుని "ఐయామ్ రెడీ" అంది.

నిజం చెప్పొద్దూ మాకు చెడ్డభయం వేసింది. ముచ్చెమట్లూ పోశాయి. అల్లంత దూరంలో కనపడేదే మా మేడనీ కొత్తగా కట్టిన

మేడలోకి వచ్చానని చూసిపోదామని పూల మొక్కలంటే ఇష్టమనీ వచ్చామని చెప్పాం.

కార్లో రాలేదా మీరు మహిళామండలి సెక్రట్రీ ట్రెజరర్ కారా - రచయిత్రి శోభాదేవి ఉపన్యాసం తరువాత సన్మానం సంగతి మీకు తెలీదా అని గర్జిస్తూ అడిగింది.

గులాబీ అంట్లకోసం వచ్చామని నేజెప్పాను. అయితే నా నవల గులాబీముళ్ళు చదవలేదా అని ఎదురు ప్రశ్న వేసింది. నేను జూనియర్ కేసి చూశా. శకుంతల "గులాబీ ముళ్ళు శోభాదేవిగారు మీరా? మైగాడ్' ఎంత సుదినం అన్నట్లు ఆశ్చర్యం అభినయించింది.

అయితే శోభాదేవి మొహం కందగడ్డరంగులో నుంచి మారి "అయితే మీకేం పని ఇక్కడ" అన్న లుక్ పెట్టి ఏదో జ్ఞాపకంవచ్చి— "రాజగోపాల్" అని రంకె వేసింది.

రాజగోపాల్ ఫుల్ సూటులో వచ్చాడు. చాలా ఛామింగ్‌గా డ్రస్సయి వచ్చాడు.

"వీళ్ళు కార్లో రాలేదట - వీళ్ళు మహిళా మణులు కాదట యీ మేడ చూద్దామని వచ్చారట. యూ ఆల్వేజ్ గివ్ మీ దరాంగ్ పిక్చర్ ...." అని విసుక్కుంది, "ఎక్స్యూజ్ మీ" అని గ్రేస్‌గా అన్నాడు మా యిద్దర్నీ సిల్లీగా చూస్తూ. కుక్కని వదిలి పెడ్తారేమోనని భయపడ్డాము.

"షో దెమ్ దిగార్డెన్" అని ఒక పేటెంటు చిరునవ్వు పారేసి లోపలికి గబగబ నడిచి వెళ్ళిపోయింది- ఆర్టీసీ బస్సు చప్పుడు చేసుకుంటూ షెడ్డులోకి వెళ్ళినట్లు.

రాజగోపాల్ మాకు గార్డెనంతా శ్రద్ధగా చూపించాడు. రెండు గులాబీ అంట్లు. ఒక డాలియా మొక్క, ఇన్ని గులాబీపూలు యిచ్చాడు

ఇంతకీ ఆవిడెవరోనని గొప్ప కుతూహలంగా వుంది. భయం భయంగా అడిగాము.

"ఆవిడ మీకేమౌతారని—"

రాజగోపాల్ విషాదంగానవ్వి బుజాలు ఎగరేసి మొక్కలకేసి తిరిగి రాక్‌హడ్సన్‌లా కొంచెంసేపు యాక్ట్‌చేసి- "మాఅక్క. పిచ్చిది. నవలల్రాసి పిచ్చెక్కింది. దానికోసం ఎవరో వస్తారని కాల్లో సన్మానమనీ సభనీ ఒకటే కలవరిస్తూవుంటుంది. లక్కీగా మీరెవరో రావడం నా అదృష్టం- అని లోపలికెళ్ళి గులాబీ ముళ్ళు నవల చెరోకాపీ తెచ్చి యిచ్చి గుమ్మందాకా వచ్చి సాగనంపాడు. ఇంకొకటె ప్రశ్న మిగిలిపోయింది. జూనియర్ని గోకా—

"మరి దొంగలు పడింది మీఇంట్లో కాదా-" అతను తల అడ్డంగా తిప్పి బొటనవ్రేలితో ఆ పక్క యింటికేసి చూపించి గేటు మూసుగుని మర్యాదగల మగవానిలా తలవంచి సెలవు దీసుకుని వెనుదిరిగాడు.

"ఎలా వున్నాడే రాక్‌హడ్సన్. కాదు రాజగోపాల్?" అన్నా

జూనియర్ మెరిసే కళ్ళతో "బ్లిస్" అంది గులాబీముళ్ళు పుస్తకాన్ని గుండెకు హత్తుకుంటూ.

దొంగలుపడ్డ వాళ్ళయింటికి మరిమాకు వెళ్ళాలనిపించలేదు. సంజ చీకట్లో ఆ రోడ్డుమీద మేమిద్దరమూ పరుగెత్తా మంటే మీరు నమ్మరు